| **Headlines:** NSE gets board nod to launch IPO via OFS, clears bonus shares | |
|---|---|
| **Source:** Eenadu | **Date:** 7 October 2016 |

# ఓఎఫ్ఎస్ రూపంలో ఎన్ఎస్ఈ పబ్లిక్ ఇష్యూ

- డైరెక్టర్ల బోర్డు ఆమోదం

**దిల్లీ:** ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో పబ్లిక్ ఇష్యూకు వెళ్లేందుకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా వాటాదార్ల షేర్లను మాత్రమే జారీ చేయాలని బోర్డు నిర్ణయించింది. భారత్‌తో పాటు విదేశాల్లోని ఎక్స్ఛేంజీలో నమోదు కావాలని ఎన్ఎస్ఈ భావిస్తోన్న సంగతి తెలిసిందే. దేశీయ పబ్లిక్ ఇష్యూ నిమిత్తం 2017 జనవరిలో సెబీకి దరఖాస్తు సమర్పించనుంది. అలాగే విదేశాల్లో నమోదు కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో దరఖాస్తు పెట్టనుంది. ఐపీఓ ప్రక్రియను వేగం చేసేందుకు ఇప్పటికే ఒక కమిటీని ఎన్ఎస్ఈ ఏర్పాటు చేసుకుంది. సిటీ గ్రూపు, మోర్గాన్ స్టాన్లీ, జేఎం ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషనల్, కోటక్ మహీంద్రా కేపిటల్‌ను మర్చంట్ బ్యాంకర్లుగా కూడా నియమించుకుంది.

**రూ.79.50 డివిడెండు...:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వాటాదార్లకు రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.79.50 డివిడెండును ప్రకటించింది. డివిడెండుకు రికార్డు తేదీగా ఈ నెల 17ను నిర్ణయించింది. అలాగే 31న డివిడెండును చెల్లించనుంది. అలాగే వాటాదార్లకు బోనస్ షేర్ల జారీ ప్రతిపాదనకు కూడా బోర్డు ఆమోద ముద్ర వేసింది. రూ.10 షేర్లుంటే ఒక షేరును బోనస్‌గా ఇవ్వనుంది. బోనస్ షేర్ల జారీ అనంతరం మొత్తం షేర్ల సంఖ్య ప్రస్తుతమున్న 4.5 కోట్ల నుంచి 4.95 కోట్లకు పెరుగుతుంది. ఇక రూ.10 ముఖ విలువ షేరును రూ.1 ముఖ విలువగా విభజించేందుకు కూడా బోర్డు నిర్ణయించింది.